

# డబ్బు ఉన్నా లేకున్నా చిక్కే

—ఎమ్. వి. నాథం

"అయ్యగా రున్నారాండీ?"

లోగడ మా పొలం పని చేసిన చిన్నయ్య కంఠం.

ఒక పావలా ఇచ్చి పంపెయ్యమన్నా. అది చేతిలో వేసుకుని, ఎగిరి గంతేశాడు.

వా డింకా గుమ్మం దాటనేలేదు. బిడ్డను చంకనేసుకు వచ్చిన ఒకామె— "పండగ పుణ్యకాలమండి, బాబయ్యా!" అనేసరికి, మా పసివాడు చిట్టి చేతులతో ఇన్ని గింజలు తెచ్చి వేస్తే, ఆ మనిషి సంతోషంగా వెళ్ళిపోయింది.

* * *

సంక్రాంతి వచ్చిందంటే పంట గింజలు గాదె కెక్కుతాయి. మనమూ, మన కుటుంబంతో బాటు సర్వులూ సరదాగా ఉండా లనిపిస్తుంది. అందుకనే ఈ పర్వ దినాల్లో కాస్త నగదూ, ఇన్ని గింజలూ కేటాయించి ఉంచుకుంటాము. ఎంతమంది రానీ, నోటితో లేదనేది చేతితో లేదంటాము. వాళ్ళెంతగానో ఆశతో వచ్చి అడుగుతారు. మనం ఎంతో సంతోషంతో ఇస్తాము.

ఇలా ఒకరు ఇవ్వడం, మరొకరు పుచ్చుకోవడం తరతరాలుగా, యుగయుగాలుగా వస్తున్న వాడుక. అంటే, కలిగినవాళ్ళు లేనివాళ్ళకు సాయపడాలనేది ప్రాచీనులు నిర్దేశించిన ఒక సంప్రదాయం. కష్టసుఖాలూ, సుఖ సంపదలూ సమస్త జనులూ సరి సమానంగా పంచుకోవాలని ఈ నాటి రాజకీయ వేత్తలు నిరూపించే నిగూఢమైన ఆర్థిక సూత్రం.

* * *

అయితే, డబ్బుకోసం ఈ తాపత్రయం ఎందుకని? ప్రతి వ్యక్తికీ జీవితంలో ఎదురయ్యే సమస్య ఇది. డబ్బుంటే కొండమీది కోతి దిగి వస్తుంది; కోరుకున్న కోరికలు తీరతాయి; మనుగడ హాయిగా సాగిపోతుంది. అవును, బాగానే ఉంది.

మరి, లేనివాళ్ళ మాట? నిర్ధనుల జీవితం వ్యర్థం. ధనహీనుడు గడ్డి పరకకు కొరగాడు. వాడి అవస్థ ఆ దైవానికే ఎరుక. ఈ సంగతి వేమన చెప్పాడు; భర్తృహరి వక్కాణించాడు; వేదాలు ఘోషిస్తున్నాయి.

* * *

ఈ హృదయావేదన ఈనాడే కాదు, పురాణ యుగంలోనూ కనుపిస్తున్నది. ప్రస్తుత చరిత్రలో నడుస్తున్నది. మునుముందూ ఉండి తీరుతుంది.

కుచేలుడు నిరుపేద. అందుకు తోడు అధిక సంతానం. భార్య పోరు పడలేక బాల్యమిత్రుడైన శ్రీ కృష్ణుడి వద్దకు ప్రయాణం కట్టాడు. ఎలాగో అష్ట కష్టాలూ పడి ఊరి పొలిమేర సమీపించే సరికి పట్టుకుంది మనోవేదన.

"ద్వారకా నగరంబు నేరీతి జొత్తును?
భాసురాంతః పురవాసియైన
యః పుండరీకాక్షు నఖిలేశు నెట్టంగి
దర్శింపగలను? తద్వారపాలు
రెక్కడి విప్రుండ వెందేల వచ్చెద
వని యడ్డు పెట్టిరే నపుడు వారి
కేమైన పరిదాన మిచ్చి చొచ్చెదనన్న
నూహింప నర్థశూన్యుండ నేను.."

'అయ్యో! ఇక నేమిటి గతి? అల్లంత దూరం నించి ఎంతో ఆత్రతతో మిత్రుణ్ణి చూడవస్తినే! భవనం లోపలికి పోదామంటే వశీకరణ సాధనం చేత కాసు లేకపోయెనే?' అంటూ కుచేలుడు పరిపరి విధాల వాపోయాడు. ఇంతకు మించి మరెవరు మాత్రం డబ్బులేని బాధ వెల్లడించగలరు?

* * *

ఇదే కాదు. చారిత్రికమైన ఒక సంఘటన కూడా ఈ లోకసత్యాన్ని బలపరుస్తున్నది. రామ భక్తులలో మొట్టమొదట చెప్పవలసిన వ్యక్తి త్యాగరాజు. శ్రీరాముణ్ణి మనసున నిలిపి ఆరాధించిన అగ్రేసరులలో మేటి త్యాగయ్య. ఎన్ని విధాల కీర్తించినా, ఆ రామయ తండ్రి కరుణా కటాక్షం లభించక పోయేటప్పటికి, చివరికి ప్రాణం విసిగి, 'పరిదాన మిచ్చితే పాలింతువేమో!' అంటూ ఆ కాస్త మాటా అనేశాడు.

చూడగా—ప్రతిఫల మిచ్చి పని జరిపించుకోగలమనే తత్త్వం మానవ జాతిలో పుట్టుకతోనే ఉన్నట్టుంది.

పర్వపు రోజుల పండగ మామూళ్ళు మన పెద్దలు ఏర్పరిచినవే. ఈ ఆచారాన్ని పాటించినప్పుడే మనం పరస్పర క్షేమం చూచుకొన్నట్టు. అప్పుడే జీవితం ఆనంద దాయకంగా సాగుతుంది. బహుశా, దీన్నిబట్టే పుట్టిందేమో 'పెట్టుపెత్తల్లి' అనే సామెత.

* * *

'ధన మూల మిదం జగత్!'

ఒక వ్యక్తి ధన సంపాదనకోసం అష్ట కష్టాలూ పడుతూంటే, అతగాడికి డబ్బు పిచ్చి పట్టిందంటారు, లోకులు.

ఉదారతతో ధారాళంగా డబ్బు ఖర్చు పెడితే, వాడికి ఒళ్ళూ పై తెలియడం లేదంటారు.

ఖర్చు విషయంలో కాస్త పిడికిలి బిగబట్టి పొదుపుగా ఉంటే, వాడు పరమ లోభి, పిసినిగొట్టు.

లోకం దృష్టిలో డబ్బు లేనివాడు అప్రయోజకుడు.

సంపాదనకు యత్నించకపోతే చేరవ లేని వాజమ్మ.

అప్రయత్నంగా ధనం లభిస్తే, అటువంటి వాణ్ణి 'పరాన్నభుక్కు' అంటారు.

జీవిత మంతా కష్టించి డబ్బు నిలవ చేసుకుంటే, 'ఎందు కొచ్చిన జన్మ! దేవుడింత ఇచ్చినందుకు హాయిగా అనుభవించలేక పోతున్నాడు, మూర్ఖుడు!' అని ఏమేమో...

డబ్బును గురించిన చిక్కులు ఎన్నని చెప్పడం?

డబ్బు ఉన్నా చిక్కే! లేకున్నా చిక్కే! ★

